
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 11 | మే | 2025 ◆ పేజీలు : 4



## కార్పొరేట్ కు ధీటుగా వైద్య సేవలు

- మెడికల్ బోర్డులో దందాలపై ఉక్కుపాదం
- ఆరోగ్య సమస్యలుంటే నేరుగా సంప్రదిస్తే న్యాయం చేస్తాం
- దళారులను నమ్మి మోసపోవద్దు
- వైద్యశాల పరిసరాలలో శుభ్రత పాటించాలి
- రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి
- విద్యుత్ దుర్వినియోగం చేయవద్దు
- గుండెపోటు మరణాలపై ముందస్తు చర్యలు
- ప్రజాజ్యోతితో సింగరేణి సీఎంఓ డా. కిరణ్ రాజ్ కుమార్



**ఇల్లందు, మే 10, ప్రజాజ్యోతి :** కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా సింగరేణిలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, అందులో భాగంగా మిగతా 2 లో...

## కటకటాల్లోకి... మరికొందరు..?

- సింగరేణిలో ఏసీబీ దాడులు
- ఒకరు అరెస్ట్, మరికొంతమందిపై దర్యాప్తు వేగవంతం
- అరెస్టు అయిన వ్యక్తి దగ్గర నుండి కీలక ఆధారాలు సేకరణ
- సన్నిహితులు, సహ ఉద్యోగులు కొందరు అధికారులపై సందేహాలు
- డిస్మిస్ ఉద్యోగి సంపత్ పాత్ర పై పలు అనుమానాలు..?
- పలువురి పై మరో విడత దాడులు జరిగే అవకాశం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 10 (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థ ఉద్యోగిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ఎసిబి అధికారులు ముసుగుపడిన దాడులు చేపట్టిన విషయం విధితమే. ఈ దాడుల్లో, ప్రధాన కార్యాలయం ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరంకు చెందిన అన్నబోయిన రాజేశ్వరరావు అనే ఓ ఉద్యోగిని అధికారులు అరెస్టు చేశారు. సంస్థలో ఎన్సిడబ్ల్యూఏ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేశ్వ రరావును ఏసీబీ అదుపులోకి తీసుకుంది. అతను మెడికల్ బోర్డుల పేరిట మోసం, ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్ లు చేయిస్తానంటూ అవక తవకలు జరిపినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇతనిని అదుపులోకి తీసుకున్న అధికారులు, అతని నివాసంలో సోదాలు జరిపారు. ఇందులో పలువురు ఉద్యోగుల వ్యక్తిగత ఫైళ్లు, మెడికల్ బోర్డుకు సంబంధించిన అనుమానాస్పద డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, గత ఏడాది కాలంలో అతని ఖాతాలో రూ.50 లక్షల వరకు అనుమా నాస్పదంగా లావాదేవీలు జరిగినట్టు అధికారుల గుర్తించారు. తదుపరిగా ఇతనిని అరెస్ట్ చేసి

మిగతా 2 లో...



## జలగలుగా రాష్ట్రాన్ని పట్టిపీడించారు

- దోపిడీదారుల మాటలు నమ్మకండి
- సంవత్సరం పాటు పడుకొని ఇప్పుడొచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు
- అప్పులు తెచ్చి దోచుకు తినటమా పాలన అంటే
- అభివృద్ధి కోసం సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే దోచుకుతిన్నారు
- ప్రజలకు మంచి చేయడం మీకు నచ్చట్లేదా
- మాయ మాటలు చెప్పి ప్రజలను ముంచింది గత ప్రభుత్వం... తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కాళేశ్వరం పేరుతో బొమ్మలు చూపెట్టారు
- 10 సంవత్సరాల్లో ధనిక తెలంగాణని కొల్లగొట్టారు
- రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది సరిదిద్దుకుంటూ వస్తున్నాం
- దేశానికే రోల్ మోడల్ భూభారతి చట్టం.. రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**అశ్వారావుపేట, మే 10, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు మంచి వనరులు ఉన్నాయని ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేస్తున్నారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రం ప్రకటించాలని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తే, మాయ మాటలతో అధికారాన్ని చేజిక్కించుకొని రాష్ట్రాన్ని జలగలుగా పట్టి పీడించారని అటువంటి దోపిడీదారుల మాటలు ప్రజలు నమ్మవద్దని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం అశ్వారావుపేట నియోజకవర్గం లో సుమారు రూ.37.64 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33 కెవి విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన కార్య క్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారా యణలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన

మిగతా 2 లో...

# కార్పొరేట్ కు ధీటుగా వైద్య సేవలు





(మొదటి పేజీ తరువాయి...)

సుమారు రూ. 150కోట్లతో హైదరాబాద్ లో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను నిర్మించడం జరుగుతుందని సింగరేణి సీఎంఓ డా. కిరణ్ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం ఇల్లందు సింగరేణి వైద్యశాలను తనిఖీ చేసిన అనంతరం ప్రజాజ్యోతి తో మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో భాగంగా మెడికల్ ఇన్వాల్యుడేషన్ కోసం జరుగుతున్న దందాలపై సీఎండి ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగిందని, అలాంటి దందాలపై ఉక్కుపాదం మోపునున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ బోర్డులో ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. మెడికల్ బోర్డులో అన్ఫిట్ చేస్తామని మాయమాటలు చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. వైద్య శాలలోని పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చే వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించవద్దని, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని చికిత్స నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా వేసవికాలం అయినందున విద్యుత్ ను దుర్వినియోగం చేయవద్దని, అవసరం ఉంటేనే తప్ప లైట్లు, ఫ్యాన్లు వినియోగించాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు వైద్యశాలల్లో డిజిటల్ ఎక్స్రే పరికరాల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఆ డిజిటల్ ఎక్స్రే పరికరాలతో పీఎంఈ, ఐయంఈ కి వినియోగించుకోవాలని సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు. మెడికల్ బోర్డులో దందాలకు పాల్పడిన వారు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే నేరుగా సంప్రదిస్తే వారికి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా సింగరేణిలో వైద్య సేవలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గుండెపోటు వచ్చే వారికి స్టంట్ వేసే కార్డియార్ క్యాట్లాగ్ ను నూతనంగా రామగుండం ఏరియాలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాని ద్వారా బెల్లంపల్లి, రామగుండం ఏరియాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గుండెపోటు మరణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సిరియాక్ క్యాంపులను సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏరియాలలోని వైద్యశాలలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, తద్వారా వైద్యం అందించడం సులభతరం అవుతుందన్నారు. ఇల్లందు ఏరియాలోని వైద్యశాలలో వైద్యులు, సిబ్బందిని త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా వైద్యశాలలో పనిచేసే సిబ్బందికి కాలయాపన కాకుండా యూనిఫార్మ్స్ అందజేస్తామన్నారు. వైద్యశాలలో ఏమైనా సమస్యలు ఉంటే డివై సీఎంఓ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్మిక ఆరోగ్య శ్రేయస్సే సింగరేణి సంస్థ లక్ష్యమని స్పష్టం చేశారు.


# కటకటాల్లోకి మరికొందరు..?

(మొదటి పేజీ తరువాయి...)

రిమాండ్ కు తరలించారు. అయితే తాజా సమాచారం మేరకు, దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న వివరాల నేపథ్యంలో మరికొంతమంది రాజేశ్వరరావు సన్నిహితులు, సంస్థ ఉద్యోగులు, అధికారులపై కూడా అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు అరెస్ట్ అయిన వ్యక్తి దగ్గర నుండి మరింత సమాచారం సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో.. పూర్వంలో సింగరేణి ఉద్యోగిగా పనిచేసి, రెండు ఏసీబీ దాడులను ఎదుర్కొని డిస్మిస్ అయిన సంపత్ అనే వ్యక్తి కీలక పాత్ర పోషిస్తున్నట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఇతని కనుసన్నలోనే ఈ వ్యవహారం అంత జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక, సంస్థలోని పర్సనల్ విభాగానికి చెందిన కొందరు అధికారులు, మరికొంతమంది సహోద్యోగులు, సెంట్రల్ వర్క్ షాప్ లో టెక్నీషియన్ గా పనిచేస్తున్న 'మురళి'లీలుడు, కొత్తగూడానికి సంబంధించిన న్యాయవాది, పర్సనల్ విభాగానికి చెందిన రిటైర్డ్ జీఎం (ప్రస్తుతం న్యాయవాది), ప్రధాన ఆసుపత్రిలోని కొందరు, కొత్తగూడెం ఏరియాలోని ఓ మహిళ ఉద్యోగి, సింగరేణి భవన్ లోని ఓ ప్రముఖ అధికారి వర్గం కూడా దర్యాప్తు పరిశీలనలో ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాకుండా కొందరు ముఠాగా ఏర్పడి ఈ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని గ్రహించిన అధికారులు సింగరేణి విస్తరించి ఉన్న 11 ఏరియాలలోని అరెస్ట్ అయిన వ్యక్తి, అతని సహచరుడు సంపత్ సంబంధికులపై కూడా నిఘా ఉంచినట్టు వినికిడి. ఈ నేపథ్యంలో ఏసీబీ తన దర్యాప్తును మరింత వేగవంతం చేయగా, మరికొంతమందిపై విచారణలు, సోదాలు జరగవచ్చని తెలుస్తోంది. సంస్థలో అవినీతి భూతాన్ని వెలికి తీసే దిశగా అధికారులు కీలక ఆధారాలను సేకరిస్తున్నారూ. వారి ఆస్తుల వివరాలు, బ్యాంక్ లావాదేవీలు, బినామీ పేర్లలో ఉన్న భూముల సమాచారం పరిశీలిస్తున్న ఏసీబీ, త్వరలోనే మరో విడత దాడులకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అరెస్టయిన వ్యక్తి నుంచే కీలక సమాచారాన్ని ఏసీబీ సేకరించిందని తెలిసింది. దర్యాప్తు కొనసాగుతుండగా, ఉన్నతాధికారుల అనుమతితో మరికొంతమంది అధికారులు, సంబంధితులపై కూడా విచారణ జరిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇకపోతే ఈ కేసు మరింత పదును పడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయంపై ఎక్కడ వెనకడుగు వెయ్యబోమంటూ వ్యవహరిస్తోంది. డిప్యూటీ సీఎం ఈ అంశంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. ఈ దెబ్బతో సింగరేణిలో ఉన్న పైరవికారులను వేరివేయాలని అటు ప్రభుత్వం, ఇటు సింగరేణి యాజమాన్యం యోచిస్తుంది. వేచి చూడాలి మరి ఏసీబీ అధికారుల దర్యాప్తుతో ఎంతమంది కటకటాల పాలవుతారో.

# జలగలుగా రాష్ట్రాన్ని పట్టిపీడించారు

(మొదటి పేజీ తరువాయి...)




సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధిస్తారని, నాడు ఉద్యమం చేశామని సోనియా గాంధీ పార్లమెంట్లో బిల్లు పెట్టి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పాటు రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని ఇప్పుడు కూడా సంవత్సరం పాటు ఫామ్ హౌస్ లో పడుకొని వచ్చి రాష్ట్ర ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ధనిక రాష్ట్రం ఇస్తే లక్షల కోట్ల అప్పు చేశారని తెచ్చిన డబ్బులు ప్రజలకు ఖర్చు చేశారా అంటే అది కూడా లేదన్నారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి పనికిరాని ప్రాజెక్టు కట్టారని ప్రజలకు మంచి చేయాలనుకుంటున్న ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తెచ్చి ఇష్టరీతిన దోచుకు తిన్న ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతో ఈనాడు కొత్త అప్పులు చేయకుండా ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామన్నారు. మీరు మూడు ఎకరాల భూమి ఇంటికి ఒక ఉద్యోగం కేజీ టు పీజీ విద్య లాంటి ఎన్నో హామీలు ఇచ్చారని, లక్షల కోట్ల అప్పు తెచ్చిన ఎందుకు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం లోపే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మరో 30 వేల ఉద్యోగాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఒకే విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3500ఇళ్ల చొప్పున 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ యువ వికాసం అనే పథకం అమలు చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఐదు లక్షల మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందుతారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రతి రైతుకు రెండు లక్షల లోపు ఉన్న రుణాలను రూ. 21,500 కోట్లు రుణమాఫీ చేశామని 10 సంవత్సరాలు రైతులను పట్టించుకోని మీరు నేడు ఏ మొహం పెట్టుకొని మాట్లాడుతున్నారన్నారు. రైతులకు ఇన్సూరెన్స్ కింద రూ.1,970 కోట్లు కట్టామని రైతు సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు రూ.13వేల కోట్ల రూపాయలతో పెద్దవాళ్లు తినే సన్నబియ్యం పేదలకు అందిస్తున్నామన్నారు. గిరిజనులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోడు పట్టాలు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలిస్తే వారిని దున్నుకోకుండా ఆడవాళ్ళని కూడా చూడకుండా చెట్లకు కట్టేసి కొట్టారని నేడు వారికి రూ.12,500 కోట్లతో ఇందిరా సౌర వికాస్ సోలార్ పథకం అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వం పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రాజు ఆరోగ్య శ్రీ కి 10 లక్షలు పెంపు మహిళలకు ఉచిత ప్రయాణం హాస్టల్లో విద్యార్థులకు మిస్ చార్జీలు పెంపు వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించడం మీకెందుకు నచ్చట్లేదు అని ప్రశ్నించారు. ప్రతి నియోజక వర్గానికి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూలు మంజూరు చేశామని 25ఎకరాలలో 200కోట్లతో కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాల రూపొందుకుంటుందన్నారు. మీరు రాష్ట్రాన్ని దోచుకు తింటే న్యాయమా.. మేము ప్రజలకు పంపిణీ చేస్తుంటే అన్యాయమా అన్నారు.

## కాళేశ్వరం పేరుతో బొమ్మలు చూపెట్టారు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

గత టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ప్రజలకు చేసింది ఏమీ లేదని వారే ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారని కాళేశ్వరం పేరుతో బొమ్మలు చూపెట్టి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా అతలాకుతలం చేస్తే దాన్ని సరిదిద్దుకుంటూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం అద్భుతమైన చట్టమని దేశంలో ఏ రాష్ట్రంలో ఎంత మంచి చట్టం లేదన్నారు. ఇది దేశానికే రోల్ మోడల్ అని భూ సమస్యలను పరిష్కరించడమే ఈ చట్టం లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు భద్రత కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం అనే పథకాన్ని జూన్ 02 తేదీ ప్రారంభిస్తున్నామన్నారు. విద్య వైద్యం పట్ల తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక దృష్టితో ఉందన్నారు. గురుకులాలు పెట్టామని డబ్బాలు కొట్టుకుంటున్న గత ప్రభుత్వ పెద్దలు కోళ్ల ఫారాలలో, రైసు మిల్లులో పెట్టి విద్యార్థులను ఇబ్బందుల పాలు చేశారని మండిపడ్డారు. ప్రతి పేదవాడి పిల్లలకు మంచి భోజనం అందించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40% మిస్ చార్జీలు పెంచామని డబ్బులు లేకపోయినా మంచి మనసు ఉంది కాబట్టే మార్గాలను వెతికి పేదవాడి మొహంలో చిరునవ్వు చూసేందుకు ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతుభరోసాకు ప్రతి రైతుకు రూ.12వేలు అందిస్తున్నామని రైతు పండించిన వారికి 500 బోనస్ ఇస్తూ వడ్లు కొంటున్నామని ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సాయి శక్తుల ప్రయత్నిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజా పాలనలో మీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటిడిఏ పిఓ రాహుల్, పలువురు నాయకులు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# శాంతిస్థాపనకు త్రివిధ దళాలు చేస్తున్న కృషి విజయవంతం కావాలి





- **గోశాలలో ఈవో పూజలు, హోమాలు**

**భద్రాచలం, మే 10, ప్రజాజ్యోతి :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ లో శాంతిస్థాపనకు త్రివిద దళాలు చేస్తున్న కృషి విజయవంతం కావాలని, దేశంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుతూ భద్రాచలం దేవస్థానంలోని గోశాలలో ఆలయ ఈవో రమాదేవి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. గోశాల వద్ద ఆలయ ఈవో అర్చకులతో కలిసి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కేంద్రం ఉగ్రవాద దాడిని వ్యతిరేకిస్తూ చేస్తున్న సింధూర్ ఆపరేషన్ సక్సెస్ కావాలని, భారతావని సుభిక్షంగా ఉండాలని ఈ పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులతో పాటు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## భద్రాద్రి పోలీస్ అలర్ట్

- సెలవులు రద్దు.. జిల్లా దాటి వెళ్లొద్దని ఆదేశాలు
- సోషల్ మీడియాపై నిశిత దృష్టి
- భారత్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులతో జిల్లాలను అలర్ట్ చేసిన ప్రభుత్వం





**భద్రాచలం , మే 10, ప్రజాజ్యోతి :** భారత్ –పాకిస్థాన్ సరిహద్దులో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృ ష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల పోలీసులను అలర్ట్ చేసింది. పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సెలవులను రద్దు చేసి అందరూ 24 గంటలు ఆన్ డ్యూటీలో ఉండాలని వచ్చిన ఆదేశాల మేరకు భద్రాద్రి పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ జిల్లాలోని ఏఎస్పీ , డిఎస్పీ లతోపాటు జిల్లాలోని పోలీస్ స్టేషన్ లలో తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు . సిబ్బందికి, అధికారులకు కొద్దిరోజుల పాటు అన్ని రకాల సెలవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సిక్ లీవ్లలను కూడా రద్దు చేసింది. షిఫ్ట్ లు మారిన వారు కూడా జిల్లాలు దాటి వెళ్లకుండా అందుబాటులో ఉండాలని, ఎప్పుడు పిలిచినా నిమిషాల వ్యవధిలో డ్యూటీ లో చేరేలా వారిని అప్రమత్తం చేసింది. కొత్త వ్యక్తులు, అనుమానితులపై నిఘా ఉంచాలని, అదే విధంగా సోషల్ మీడియా పోస్టులపైనా నిఘా ఏర్పాటు చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మతాల మధ్య చిచ్చు రగిల్చే వ్యాఖ్యలు సోషల్ మీడియాల్లో పెట్టవద్దని, అలాంటి పోస్టులపై చర్యలు తప్పవని ఇప్పటికే పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో పోలీస్ శాఖ ముందస్తు భద్రత చర్యలు చేపట్టింది. గుర్తింపు కార్డులు లేకుండా లాడ్జిలలో వసతి కల్పించవద్దని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. భారత్ పాకిస్థాన్ల మధ్య యుద్ధం నడుస్తుండటంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. భద్రాచలం పట్టణంలో స్థానిక బ్రిడ్జి పాయింట్ , అంబెద్కర్ సెంటర్ , బస్ స్టాండ్ సెంటర్ , చర్ల రోడ్ , కూనవరం రోడ్లతోపాటు పోలీసులు జనావాస ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. ప్రజలు ఎవరూ అనుచిత పోస్ట లకు, తప్పుడు సమాచారం పోస్ట్ చేయవద్దని పోలీస్ ఉన్నతాధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం గా ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాపై పటిష్ట నిఘా కొనసాగుతుందని, అందరూ చట్టానికి లోబడి వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని బాధ్యత గల పౌరులు వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.

## సిహెచ్ పి మ్యాన్ పవర్ పెంచాలి




**ఇల్లందు, మే 10, ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియాలోని సిహెచ్ పి మ్యాన్ పవర్ పెంచాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం సిహెచ్ పి ఇంచార్జ్ డివైజీఎం క్రీస్టోఫర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సిహెచ్పిలో జనరల్ అసిస్టెంట్ల కొరత ఉందని, అదేవిధంగా క్లర్క్ల స్టాఫ్ కూడా తక్కువగా ఉన్నారన్నారు. ప్రతి రోజూ రెండు రేకులు బొగ్గు రవాణా జరుగుతుందని, జనరల్ అసిస్టెంట్ల కొరత వల్ల రెక్ చెకింగ్, డంపింగ్ లో చాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. క్లర్క్ ల కొరత వల్ల వేబ్రిడ్జీలలో జనరల్ అసిస్టెంట్లను పెట్టి విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మ్యాన్ పవర్ కొరత వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను నివారించాలని, వివిధ విభాగాల స్టాఫ్ ను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్పి పిట్ సహయ కార్యదర్శి మహ్మద్ యాకూబ్, నాయకులు వజ్రాల అప్పిరెడ్డి, సంతోష్ కుమార్, కుమార్, రాజలింగం, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- **బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ**



**భద్రాచలం, మే 10, ప్రజాజ్యోతి :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ అధికా రులు పారదర్శకంగా నిర్వహించి, లబ్దిదారులను ఎంపిక చేయాలని భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, అనుచరులు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తమ స్వార్ధ ప్రయోజనాల కోసం జాబితా తయారుచేసి ఆ జాబితానే అధికారులు ఆమోదించాలని వత్తిడి తెస్తూ అధికారులను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎల్–1, ఎల్–2, ఎల్–3 అనే తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అన్ని మండలాల్లోని గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తామని, ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని అధికారులు కూడా ఈ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, మళ్లీ రీ ఎంక్వైరీ చేయిస్తామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేంతవరకు ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటీవల జరిగిన గృహ నిర్మాణ శాఖామంత్రి భద్రాచలం పర్యటనలో ప్రజల నుంచి మండలంలో నిరసన వ్యక్తమైందని, లబ్దిదారుల ఎంపికలో ఎంత అవినీతి జరిగిందో అదే ఉదాహరణగా అభివర్ణించారు. జాబితా విషయంలో అధికారులు సర్వేచేసి నిరుపేద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు.

## ఇల్లందు ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సిఎంఓ





**ఇల్లందు, మే 10, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా వైద్యశాలను శనివారం సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ కుమార్ సందర్శించారు. ఏరియా ఆసుపత్రి నందు రోజువారీ ఓపి వివరాలు, వార్డ్ రూమ్, అత్యవసర విభాగం, ఇన్ పేషంట్ , రిఫరీ కేసులు , ముందుల వివరాలు, స్టోర్ రూమ్ నందు నిల్వ ఉన్న స్టాక్ వివరాలు, ఆక్సిజన్ మిషన్ ల పనితీరు, రోజు వారి రక్త, ముత్ర పరీక్షలు ఎక్స్ రే గది రికార్డులను తనిఖీ చేశారు. హాస్పిటల్ లో అడ్మిట్ అయిన రోగులతో మాట్లాడి వారికీ అందుతున్న వైద్యంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారితో ఆప్యాయంగా మాట్లాడాలని, వారికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారికీ అందించే వైద్య సేవలలో ఏలాంటి అంతరాయం ఏర్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం వార్డులో అడ్మిట్ అయిన వారికీ స్వయంగా వైద్యం అందించారు. జిఎం వీసం. కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. జిఎం కార్యాలయంలో అధికారులు శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. నరసింహరావు, యస్ఓ టూ జిఎం రామస్వామి, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, ఏజీఎం ఐఈడి గిరిధర్ రావు, డీజీఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, ఇతర అధికారులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీర జవానుకు ఘన నివాళి



**టేకులపల్లి, మే10, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం బొమ్మనపల్లి లోని సబ్ స్టేషన్లో శనివారం పాకిస్తాన్తో జరిగిన యుద్దం భూమిలో వీరమరణం పొందిన అనంతపురం జిల్లా గోరంట్ల మండలం తల్లి తండాకు చెందిన వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి సబ్ స్టేషన్ ఏ.ఈ బుజ్జి కన్నయ్య పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన వీర జవాన్ ప్రదర్శించిన ధైర్య సాహసం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. జవాను మురళినాయక్ దేశాన్ని కాపాడాలని త్రివర్ణ పతాకం తలవంచకుండా నిలబెట్టేందుకు వీర మరణం పొందారన్నారు. మురళినాయక్ లాంటి వీరుల త్యాగం ఎప్పటికీ మన గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బార్డర్లలో మన సైనికులు ఎంతో నిబద్ధతతో, దేశం మీద ప్రేమతో మంచెనుక, గుట్టలనక, ఎడారి అనక పహారా కాస్తుండడంతో మనం ఏ చీకూచింత లేకుండా హాయిగా నిద్ర పోతున్నామని వారు అన్నారు. జై భారత్ మాతాకీ జై జై భారత్ మాతాకీ, జై జవాన్ జై కిసాన్, జై హింద్ జై భారత్ మాతాకీ అమరహే అమరహే మురళి నాయక్ అమర్ హే అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బి. దేవ్ సింగ్, డి చరణ్, ఎస్కే వసీం పాషా, ఎస్ కే యాకుబ్ పాషా, ఎండి నాగుల్ మీరా, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనికుడికి సీపీఐ ఘననివాళి



**భద్రాచలం టౌన్, మే 10, ప్రజాజ్యోతి :** దేశరక్షణ కోసం కొట్లాడి ప్రాణత్యాగం చేసిన భారత సైనికుడు మురళీనాయక్ కుటుంబానికి అందరూ అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన మృతి దేశానికి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. శనివారం భద్రాచలంలో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత సైనికుడు మురళీనాయక్ కు ఘన నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రవికుమార్ నివాళులర్పించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తూ దేశ రక్షణ కోసం పోరాడుతూ ప్రాణాలొదిలిన మురళీనాయక్ తో పాటు అమరవీరుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సీపీఐ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## సింగరేణి సిఎంఓకు ఘన సన్మానం



**ఇల్లందు, మే 10, ప్రజాజ్యోతి :** సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఓ) గా పదవీ బాధ్యతలు స్వీకరించి శనివారం మొదటిసారి ఇల్లందు సింగరేణి వైద్యశాలకు వచ్చినందున సింగరేణి వైద్యులు, సిబ్బంది శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి, వైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఐఎన్టియుసి నాయకులు పాల్గొన్నారు.

## మాతంగి సంతోష్ కు దళిత రత్న అవార్డు



**కొత్తగూడెం,మే 10, ప్రజాజ్యోతి :** ప్రభుత్వం ఎస్సీ షెడ్యూల్ కులాలు మహనీయుల జయంతుల ఉత్సవాల సందర్భంగా 2025 అవార్డుల ను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా దళిత రత్న అవార్డుకు మాదిగ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తగూడెం రామవరం ప్రాంతానికి చెందిన మాతంగి సంతోష్ మాదిగ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జయంతి ఉత్సవాల వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాదులో మాతంగి సంతోష్ దళిత రత్న అవార్డును అందుకున్నారు. దళితులను ఐక్యం చేయడంలో తమ వంతు పాత్ర పోషించిన మాతంగి సంతోష్ కు దళిత రత్న అవార్డు రావడం అభినందనీయమని పలువురు దళితులు కొనియాడారు. దళిత రత్న అవార్డు గ్రహీత సంతోష్ మాట్లాడుతూ దళిత రత్న అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దళితులను ఐక్యం చేయ డం, వారి హక్కులను సాధించడమే తమ ధ్యేయమన్నారు. అవార్డు రావడం పట్ల మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. దీంతో వారు ప్రభుత్వానికి, జయంతి ఉత్సవాల వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, దళిత సంఘాల నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 20వ తేదీన పిలుపునిచ్చిన సమ్మెను వ్యతిరేకించండి

- జాతీయ కార్మిక సంఘాల ఉనికి కోసం నిర్వహించే సమ్మె
- రాజకీయ ప్రేరణతో కూడిన చర్య
- ఇది బాధ్యతారాహిత్యమైన నిర్ణయం
- కార్మికులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి బిఎంఎస్



**కొత్తగూడెం సింగరేణి, మే 10, ప్రజాజ్యోతి :** భారతదేశం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. పాకిస్తాన్ తో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కార్యక్రమంలో దేశ సార్వభౌమత్వాన్నికాపాడేందుకు తీవ్రంగా పోరాడుతోంది. ఇటీవల కాలంలో మెడికల్, భద్రతా అత్యవసర పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో, కొన్ని కార్మిక సంఘాలు ఈ నెల 20వ తేదిన సమ్మెకు పిలుపునివ్వడం బాధ్యతారాహిత్యంగా ,శోచనీయంగా ఉంది. రాజకీయాలకి అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి అన్నిరాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు పలుకుతున్న సందర్భంలో, కొన్ని కార్మిక సంఘాలు తమ ఉనికిని చాటుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ సమ్మెను ప్రేరేపించడం సమంజసం కాదని ఎబికెఎంఎస్ కార్యదర్శి,జెబిసిసిఐ & సిపిఆర్ఎంఎస్ –ఎన్ ఇ బి ఓ టి సభ్యులు పి. మాధవ నాయక్ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని బిఎంఎస్ భవనంలో జీవీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండి దేశానికి అండగా ఉండేలా, మరింత బాధ్యతతో ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో సమ్మెకు పిలుపు ఇవ్వడం జాతీయ ఐక్యతను దెబ్బతీసే ప్రమాదాన్నికలిగించగలదని అన్నారు. ఈ సమ్మెను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు తీసుకుని కార్మికుల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో టిఎస్ పవన్ కుమార్, రామ్ సింగ్, మొగిలి పాక రవి, ఉట్ల గణేష్, నాగ ప్రసాద్, యం . శ్రీనివాస్, జి వెంకట రెడ్డి, ఏ వెంకటేశ్వర్లు, రాజేష్, శ్రవణ్ కుమార్, శివకుమార్ తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దెల శివకుమార్ స్వీరచనలో.. పాకిస్తాన్ -ఖబడ్దార్" అనే నూతన గీతం

- నూతన గీతాన్ని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క










**కొత్తగూడెం ,మే 10 ,ప్రజాజ్యోతి :** దేశ విపత్కర పరిస్థితిలో కళాకారులు కవులు అన్ని వర్గాల ప్రజలు, సంఘటితమై, శత్రుమూకలను తరిమికొట్టాలి. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మానవత్వాన్ని మంట కలిపి మతవిద్వేశంతో, భారతదేశ సమైక్యతను అస్థిర పరచాలని, దొంగ దాడులు చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని, ఈ విపత్కర పరిస్థితిలోకళాకారులు కవులు ముందుకు వచ్చి ప్రజలను ఉన్ముకులను చేయాలని, అన్ని వర్గాల ప్రజలు సంఘటితశక్తిగా ఏకతాటిపై మన దేశానికి వెన్నుదన్నుగా నిలిచి, మన సైనికులలో ఆత్మ స్థైర్యాన్ని నింపి, శత్రు మూకలను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రముఖ కొత్తగూడెం కళాకారుడు కవి, సినీగీత రచయిత గాయకుడు , మద్దెల శివకుమార్ కళాకారుడిగా తన గురుతర బాధ్యతతోపాకిస్తాన్ ఖబర్దార్ "అనే చక్కని గీతాన్ని స్వయంగా రచించి ఆలపించి సమర్పించినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. అశ్వరావుపేట లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మద్దెల స్వీయ రచన, గానం సమర్పణతో రూపుదిద్దుకున్న పాకిస్తాన్ ఖబర్దార్ అనే నూతన గీత ఆవిష్కరణను తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయకులు మద్దెల శివ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి పాల్, కోటేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సాయి సుధీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాల్వంచ తహసీల్దార్ ధార ప్రసాద్





**పాల్వంచ, మే 10,ప్రజా జ్యోతి :** పాల్వంచ మండల నూతన తహసీల్దార్ గా ధార ప్రసాద్ నియామకమయ్యారు. పాల్వంచ తహసీల్దార్ గా వివేక్ ఎన్నో భాద్యతలు నిర్వర్తించి, తాను బూర్గంపహాడ్ తహసీల్దార్ గా బదిలి అయ్యారు.